

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని భారీ గజమాలతో సన్మానిస్తున్న శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

ఘనంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

రక్తదానం చేసిన ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు

తాండూరు, ఆగస్టు 5 : తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. తాండూరు ప్రజాభవన్‌లో ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు రక్తదానం చేసి.. అనంతరం బర్త్‌డే కేక్ కట్ చేశారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు గజమాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో నాయకులు, అభిమానులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లోని పలు ప్రాంతాల్లో నాయకులు, అభిమానులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి.. ఆయన రాజకీయ రంగంలో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రత్యక్షంగా.. పరోక్షంగా తనకు ఆశీస్సులు తెలిపిన వారందరికీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సేవ చేస్తానన్నారు. వెనుకబడిన తాం డూరు ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు.

ప్రజావాణికి 180 ఫిర్యాదులు

రంగారెడ్డి, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 180 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు విన్నవించి అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడు తూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందిం చే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

వికారాబాద్‌లో 141 అర్జీలు

వికారాబాద్, ఆగస్టు 5 : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 141 అర్జీలను అందించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఆరులేన్ల కొత్త రోడ్డు

- ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖం
- ప్రతిపాదనలు పరిశీలించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక

ఇబ్ర హీంపట్నం, ఆగస్టు 5 : ఔటర్ రింగ్ రోడ్డు నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఆరులేన్ల కొత్త రోడ్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో రోడ్డు ప్రతిపాదనను రంగారెడ్డి కలెక్టర్ శశాంక పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేటలో ఇటీవల స్కిల్ డెవలప్‌మెంట్ సిటీ ఏర్పాటుకు భూమి పూజ చేసిన విషయం తెలిసింది. ఇందులో భాగంగానే స్కిల్ డెవలప్‌మెంట్ సిటీకి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొంగరకలాన్, ఎలిమినేడు ,తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, పంజాగుట్ట, మీర్‌ఖాన్‌పేట వరకు కొత్తగా ఆరు లేన్ల రోడ్డును ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి మ్యాప్‌ను కూడా రూపొందించింది.. ఈ మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించిన తర్వాత ఫైనల్ అయ్యే అవకాశాలున్నాయి. ఈ రోడ్డు కోసం కొంగరకలాన్‌లో 62 ఎకరాలు, ఎలిమినేడులో 46 ఎకరాల భూమి, మీర్‌ఖాన్‌పేట, పంజాగుట్ట, గుమ్మడవెల్లి, తుమ్మలూరు, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లోనూ భూమిని సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో భూములకు మరింత డిమాండ్ రానున్నది.

కొడంగల్ : మొక్కను నాటుతున్న రాష్ట్ర పోలీస్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం

- రాష్ట్ర పోలీస్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి
- పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపే లక్ష్యం
- రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి

కొడంగల్, ఆగస్టు 5 : పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని రాష్ట్ర పోలీస్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పురస్కరించుకొని మున్సిపల్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో.. అదేవిధంగా గ్రామాలు, పట్టణాలనూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారాన్ని రోడ్లపై వేయొద్దన్నారు. వీధి కుక్కలపై అప్రమత్తంగా ఉండాలని.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ బలరాం, ఫారెస్టు అధికారి, మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్, మున్సిపల్, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపే లక్ష్యంగా..

తుర్కయాంజాల్: పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం లో భాగంగా తుర్కయాంజాల్ అంబేద్కర్ చౌరస్తా నుంచి మాసబ్ చెరువు వద్ద ఉన్న బుద్ధుడి విగ్రహం వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ గ్రామా లు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంతేకాకుండా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, కౌన్సిలర్లు మంగమ్మ, ఉదయశ్రీ, రవీందర్‌రెడ్డి, భాగ్యమ్మ, అనురాధ, శ్రీలత, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాచారం : మొక్కను నాటి నీరు పోస్తున్న రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి పద్మజారమణ

మొక్కలు నాటి సంరక్షించాలి

యాచారం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని.. పచ్చదనం పెంపునకు మొక్కలు నాటి సంరక్షించాలని రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి, మండల స్పెషల్ ఆఫీసర్ పద్మజారమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి..విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. అనంతరం మొక్కను నాటి నీరు పోశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా పద్మజారమణ మాట్లాడుతూ..రాష్ట్రంలో స్వచ్ఛత, పచ్చదనం పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రజలు తమ ఇండ్లతోపాటు చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తొట్టెలు, టైర్లు, పాడుబడిన కూలర్లు, ట్యాంకుల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. ఇండ్ల నుంచి సేకరించిన చెత్తాచెదారాన్ని కంపోస్టు షెడ్లకు తరలించి కృత్రిమ ఎరువును తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఎంపీవో శ్రీలత, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగం రద్దుకు కేంద్రం కుట్ర

తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాల కిషన్

రంగారెడ్డి, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): దళితు ల్లో చిచ్చుపెట్టి అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కేంద్రంలోని బీజే పీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రధాని మోదీ తీర్పుగా భావిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణపై వెలువడిన తీర్పును నిరసిస్తూ సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్య వేదిక, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పో రాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ దళితులకు కావాల్సింది వర్గీకరణ కాదని, రిజర్వేషన్లను 15 నుంచి 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ తీర్పుపై పునఃసమీక్షించాలన్నారు. ధర్నాలో తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు గుండాలు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రంగారెడ్డి జిల్లా నాయకులు జగన్, మహేశ్, కృష్ణ, మనోజ్‌కుమార్, ధనరాజ్, శివ కుమార్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రాష్ట్ర మాలల ఐక్యవేదిక నాయకులు

మహాలక్ష్మీవేంకటేశ్వరాలయాన్ని సందర్శించిన టీటీడీ బృందం

పట్టణంలోని మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం టీటీడీ అధికారుల బృందం సందర్శించి చేపట్టనున్న అభివృద్ధి పనులను పరిశీలించింది. టీటీడీ ఆధ్వర్యంలో ఈ ఆలయంలో అభివృద్ధి పనులు జరుగనున్న దృష్ట్యా అవసరమైన స్థలం, కార్యాచరణను ఆ బృందం సభ్యులు పరిశీలించినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ డీఈఈవో నాగరాజు, ఏఈఈ జయలక్ష్మి, సహాయకుడు రవికాంత్, ఏఈ తులసీరాం, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు. -కొడంగల్, ఆగస్టు 5

మైనింగ్ వ్యాపారుల నుంచి భూములను కాపాడాలని కలెక్టర్‌కు వినతి

పూడూరు, ఆగస్టు 5 : అక్రమ మైనింగ్ వ్యాపారుల నుంచి మా భూములను కాపాడాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, పూడూరు తహసీల్దార్ భరత్‌గౌడ్‌లకు సోమవారం రైతులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని మీర్జాపూర్ సర్వేనంబర్41లో గ్రామానికి చెందిన రుక్ముద్దీన్, రషీద్, అన్వర్‌బీ, అమీనాబీ, అబ్దుల్ రహీంలకు 14 ఎకరాల పొలం ఉన్నది. ఆ పొలంలో వారు ప్రతిఏటా వరితోపాటు మామిడి తోటలను పెంచుతున్నారు. అయితే సర్వేనంబర్ 41 లోనే మైనింగ్ వ్యాపారులు తవ్వకాలు చేపడుతున్నారని.. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రోడ్డుతోపాటు మా భూములను కూడా పూర్తిగా తవ్వారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అక్రమ మైనింగ్ వ్యాపారులపై కఠిన చర్యలతోపాటు గతం లో నిర్మించిన రోడ్డునూ ఏర్పాటు చేసి మా పొలాలను తవ్వకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఆగస్టు 5 : తాండూరులోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వేన్షన్ సెంటర్(డీసీఐసీ) కింద చూపబడిన భర్తీ కానీ నాలుగు పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు వికారా బాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్ సోమవారం ఓ ప్రకటన లో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10:00 నుంచి సాయం త్రం 4.00 గంటల వరకు కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఇంట ర్వ్యూ జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ డాక్యుమెంట్లతో హాజరు కావాలన్నారు. మార్గదర్శకాలు, విద్యార్హతలు అప్లికేషన్ ఫారం vikarabad. telangana.gov. in లో పొందపర్చబడిందన్నారు.

షాద్‌నగర్ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి

తుర్కయాంజాల్, ఆగస్టు 5 : బంగారు ఆభరణాలను చోరీ చేసిందనే నెపంతో దళిత మహిళ సునీతపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన షాద్‌నగర్ పోలీసులను వెంటనే డిస్మిస్ చేసి జరిగిన ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారం దొంగతనం చేసిందని దళిత మహిళను రాత్రి 8గంటల సమయంలో ఠాణాకు తీసుకొచ్చి విచక్షణారహితంగా కర్రలతో కొట్టడం దారుణమని మండిపడ్డారు. సునీత కుటుంబసభ్యులను ఆ కారణంగా కొట్టిన పోలీసులను వెంటనే విధుల నుంచి డిస్మిస్ చేయాలన్నారు.

బాధితురాలికి న్యాయం చేయాలి

షాద్‌నగర్ : షాద్‌నగర్‌కు చెందిన దళిత మహిళ సునీతను విచక్షణారహితంగా కొట్టిన షాద్‌నగర్ పోలీసులపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకొని బాధితురాలికి న్యాయం చేయాలని కుల వివక్ష పోరాట సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం షాద్‌నగర్ సర్కారు దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించి.. ఆస్పత్రి ఆవరణలో వారు ప్లకార్డులతో నిరసన తెలిపారు. బంగారు ఆభరణాలను చోరీ చేసిందనే నెపంతో దళిత మహిళను రాత్రివేళ ఠాణాకు తీసు కెళ్లి విచారణ పేరుతో చిత్రహింసలకు గురిచేయడంపై మండిపడ్డారు. మహిళతోపాటు ఆమె భర్త, కుమారుడినీ హింసించడం సరికాదన్నారు. ఆమెపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన పోలీసులకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, జిల్లా అధ్యక్షుడు సామేల్, కార్యదర్శి ప్రకాశ్‌కారత్, లక్ష్మీదేవి, రాజు, శ్రీనూనాయక్, ఈశ్వర్‌నాయక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ : షాద్‌నగర్ సర్కారు దవాఖాన ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

రెండ్రోజుల్లో అవిశ్వాసం!

- కాంగ్రెస్ చైర్‌పర్సన్‌ను స్వచ్ఛందంగా తప్పించే ప్రయత్నం
- లేదంటే నోటీసులు.. ఇప్పటికే పూర్తైన సంతకాల సేకరణ
- పెద్దఅంబర్‌పేటకు కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక ఇక లాంఛనమే

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 5 : పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస అంశం పతాకస్థాయికి చేరింది. 'హామీ ఇస్తున్నా.. త్వరలోనే మార్పు తథ్యం' అని ఈ ఏడాది మే నెలలో నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీ అమలుకు అడుగులు పడుతున్నాయి. కాంగ్రెస్ చైర్‌పర్సన్‌ను తొలగించేందుకు మరో రెండ్రోజుల్లో అవిశ్వాసం నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నను స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పించి.. పెద్దఅంబర్‌పేటకు చెందిన కౌన్సిలర్‌కు ఆ పదవీబాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన మెజారిటీ కౌన్సిలర్లు నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల వేళ జరిగిన సమీక్షా సమావేశాల్లో పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం గురించి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితోనే చర్చించినట్లు సమాచారం. ఎన్నికలయ్యాక అవిశ్వాసంపై ముందుకెళ్దామని ఆయన అప్పట్లోనే హామీ ఇచ్చినట్లు తెలిసింది. అవిశ్వాసం ఎప్పుడు తెరపైకి వస్తుందా..? అని నాలుగేండ్లకుపైగా ఎదురుచూసిన కౌన్సిలర్లు 'ఆ టైం వచ్చేసింది.. ఇక రేపో.. మాపో' అని చర్చించుకుంటున్నారు.

వర్గాలుగా వీడి.. క్యాంపులకు వెళ్లొచ్చి..

మున్సిపాలిటీలో 24 వార్డులున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్-13 సీట్లు, బీఆర్ఎస్-8, సీపీఐ, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థి ఒక్కో సీటు గెలుచుకున్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. ఫలితంగా కాంగ్రెస్‌లోని ఓ వర్గం మద్దతుతో బీఆర్ఎస్ కౌన్సిలర్ చెవుల స్వప్న చైర్‌పర్సన్ పదవిని దక్కించుకున్నది. బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో కాంగ్రెస్ కౌన్సిలర్ చామ సంపూర్ణారెడ్డి వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచే కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉన్నాయి. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసం కోసం గతేడాది జనవరిలోనే ఓ వర్గం కౌన్సిలర్లు గట్టిగా ప్రయత్నాలు చేశారు. క్యాంపులకు సైతం వెళ్లారు. మరోవైపు, ఉన్న పదవులు చేజారిపోకుండా అవతలి వారు సైతం క్యాంపులకు వెళ్లారు. కొత్త పురపాలక చట్టం ప్రకారం.. నాలుగేండ్ల వరకు అవిశ్వాసానికి అవకాశం లేకపోవడంతో ఆ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు చైర్‌పర్సన్ స్వప్నతోపాటు మరో బీఆర్ఎస్ కౌన్సిలర్ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. దీంతో కాంగ్రెస్ బలం 15కు చేరింది. ఎమ్మెల్యే ఎన్నికల తర్వాత మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు హస్తం పార్టీలో చేరడంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 17కు పెరిగింది. చైర్‌పర్సన్ కాంగ్రెస్‌లో చేరినా ఆ పార్టీలోని ఓ వర్గం కౌన్సిలర్లు ఆమెపై అవిశ్వాసం పెట్టాల్సిందేనని ఎమ్మెల్యేకు స్పష్టం చేశారు. ఆ వెంటనే ఎంపీ ఎన్నికల కోడ్ రావడంతో ఎలక్షన్స్ ముందు అవిశ్వాస పార్టీకి మంచిది కాదనే ఉద్దేశంతో వాయిదా వేస్తూ వచ్చారు.

రేపో.. మాపో..

మున్సిపాలిటీలో రాజకీయాలు ఎప్పటికప్పుడు మారుతూ వచ్చాయి. గతేడాది మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ కలెక్టర్‌ను కలిశారు. వివిధ కారణాలతో అది ముందుకు సాగలేదు. ప్రస్తుతం చైర్‌పర్సన్‌పై మాత్రమే అవిశ్వాసం పెట్టాలని మెజారిటీ కౌన్సిలర్లు నిర్ణయించారు. అవిశ్వాస ప్రక్రియ లేకుండా స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకోవాలని సూచించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయాన్ని నియోజకవర్గ ప్రజాప్రతినిధి ద్వారా చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తున్నది. పెద్దఅంబర్‌పేటకు చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ పండుగుల జయశ్రీరాజుకు చైర్‌పర్సన్ పదవీబాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకవేళ చైర్‌పర్సన్ స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకోని పక్షంలో నోటీసులు ఇచ్చి, అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఇందుకోసం ఇప్పటికే మెజారిటీ కౌన్సిలర్ల సంతకాలూ సేకరించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఢిల్లీ నుంచి రావడమే ఆలస్యం.. రెండ్రోజుల్లో అవిశ్వాస ప్రక్రియ మరింత ఊపందుకుంటుందని పలువురు ప్రజాప్రతినిధులు చర్చించుకుంటున్నారు.

తాళ్లగుట్టతండాలో ఘనంగా తీజ్ వేడుక

గిరిజనుల సంస్కృతీసంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, తెలంగాణ సంస్కృతిలో ఈ వేడుక ఓ భాగమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి మండలంలోని పడమటితండా గ్రామ పంచాయతీ పరిధి తాళ్లగుట్ట తండాలోని గిరిజనులు తీజ్ వేడుకను ఘనంగా జరుపుకొన్నారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన యువతులు నెత్తిన బుట్టలను ఎత్తుకొని, డప్పుల వాయిద్యాల మధ్య అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తండాలోని చావిడి వద్ద ఏర్పాటు చేసిన మొలకల బుట్టల పందిరి వద్ద యువ తీయువకులు నృత్యాలు చేశారు. అనంతరం ఆ మొలకలను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణనాయక్, సురేందర్‌రెడ్డి, పాండూనాయక్, రఘు, రతన్, బాల్యా, హరి, భాను, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. -కడ్తాల్, ఆగస్టు 5

చెరువుల సుందరీకరణపై హెచ్ఎండీఏ ఫోకస్

- సెంట్రల్ మీడియన్, పార్కుల అభివృద్ధి నిర్వహణపై దృష్టిపెట్టిన అధికారులు

సిటీబ్యూరో, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): పడకేసిన నిర్వహణపై హెచ్ఎండీఏ అధికారులు ఎట్టకేలకు దృష్టి సారించారు. హెచ్ఎండీఏ చేపట్టిన చెరువుల సుందరీకరణ నిర్వహణ కొంతకాలంగా ఆగిపోయింది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ పలు దఫాల్లో చేపట్టిన ప్రాజెక్టుల నిర్వహణను గాడిలో పెట్టేలా టెండర్లను పిలిచారు. హెచ్ఎండీఏ డెవలప్ చేసిన చెరువులతోపాటు పార్కు లు, ప్రధాన మార్గాల వెంబడి పచ్చదనాన్ని పెంపొందించేలా కార్యాచరణ రూపొందించారు. గడిచిన మూడేండ్ల నుంచి హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులను భారీ నిధులు వెచ్చించి అభివృద్ధి చేశారు. హెచ్ఎండీఏతో పాటు, పలు మున్సిపాలిటీలు కూడా చెరువులు, కుంటలను అభివృద్ధి చేశాయి. ఈ క్రమంలో హెచ్ఎండీఏ చేపట్టిన అభివృద్ధి పనుల నిర్వహణపై దృష్టి సారించి పనులను ముమ్మరం చేశారు. రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం, మీడియన్ వెంబడి గ్రీనరీ పెంచేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

ఇక పార్కుల్లోనూ ఈ తరహా అభివృద్ధి పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేశారు. వచ్చే నెల నుంచి హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులు, పార్కులు, ప్రధాన మార్గాల్లో గ్రీనరీ, చెరువుల నిర్వహణతో పాటు పలు కార్యక్రమాలు ఆరంభం కానున్నట్లుగా అధికారులు వెల్లడించారు.